సాక్షి
కామారెడ్డి
శుక్రవారం । 2 । ఆగస్టు । 2024



సంతలో వసూళ్ల దందా

బాన్సువాడ మేకల సంతలో తైబజార్ నిర్వాహకులు నకిలీ స్టాంప్‌లతో ఇష్టారాజ్యంగా డబ్బులు వసూలు చేస్తున్నారు.

- IIIలో ▸



సీఎం క్షమాపణ చెప్పాలి

మహిళా ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలంటూ బీఆర్ఎస్ నేతలు ఆందోళనలు చేశారు.

- IIIలో ▸

గరిష్ఠం/కనిష్ఠం
34.6 /23.7

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరునుంచి భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

ఎస్సీ వర్గీకరణపై కోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం



నిజాంసాగర్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీ కాంతారావు పేర్కొన్నారు. గురువారం ఆయన అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడారు. దేశ అత్యున్నత న్యాయస్థానం ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇవ్వడంతో పండుగ వాతావరణం నెలకొందన్నారు. మాదిగ ఉప కులాలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రతిపక్ష నేత సభకు రాకపోవడాన్ని ఆయన తప్పుపట్టారు. స్పీకర్ స్థానంలో దళిత బిడ్డ ఉన్నందుకే కేసీఆర్ సభకు రావడం లేదంటూ విమర్శించారు.

ముగిసిన ఆపరేషన్ ముస్కాన్

కామారెడ్డి క్రైం: ఆపరేషన్ ముస్కాన్ పదో విడత కార్యక్రమం గురువారం ముగిసిందని ఎస్పీ సింధు శర్మ తెలిపారు. ఇందులో భాగంగా 46 మంది బాల కార్మికులకు విముక్తి కల్పించామని పేర్కొన్నారు. ఈ విషయమై ఆమె గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏటా జూలై 1 నుంచి 31వ తేదీ వరకు ఆపరేషన్ ముస్కాన్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి సబ్ డివిజన్‌కు ఒకటి చొప్పున ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నెల రోజుల పాటు రైల్వే స్టేషన్‌లు, బస్టాండ్‌లు, జన సమ్మర్ద ప్రదేశాలు, ఇటుక బట్టీలు తదితర ప్రదేశాలను తనిఖీ చేశామని తెలిపారు. మొత్తం 18 ఏళ్లలోపు 46 మంది పిల్లలను గుర్తించామని పేర్కొన్నారు. ఎవరైనా చిన్న పిల్లలతో పనులు చేయిస్తే 1098 నంబర్‌కు గానీ, డయల్ 100, 112 లకుగానీ సమాచారం ఇవ్వాలని సూచించారు.

'తల్లి పాలతో అనేక ప్రయోజనాలు'



కామారెడ్డి క్రైం: తల్లిపాలతో తల్లీబిడ్డలకు అనేక ప్రయోజనాలు ఉంటాయని జిల్లా కేంద్ర ఆస్పత్రి సూపరింటెండెంట్ రాంసింగ్ పేర్కొన్నారు. తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా కామారెడ్డి జీజీహెచ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రసవించిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు పట్టడం ద్వారా ప్రసవానంతర రక్తస్రావాన్ని అరికట్టవచ్చన్నారు. దీంతో రక్తహీనతను తగ్గించవచ్చన్నారు. పుట్టగానే బిడ్డకు పాలు ఇవ్వడంలో ఆలస్యం జరిగితే తల్లికి రొమ్ములలో పాలు గడ్డ కట్టే అవకాశం ఉంటుందన్నారు. డయాబెటిక్ సమస్య ఉన్న తల్లులు బిడ్డకు పాలు ఇవ్వడం ద్వారా ఇన్సులిన్ తీసుకునే అవసరం తగ్గుతుందన్నారు. గర్భిణీగా ఉన్నప్పుడు పెరిగిన బరువు పాలు ఇవ్వడం ద్వారా కోల్పోతారన్నారు. కార్యక్రమంలో వైద్యులు శ్రీనివాస్, బాలింతలు, గర్భిణులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

నేడు దోస్త్ ప్రత్యేక కేటగిరీ ధ్రువపత్రాల పరిశీలన

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో దోస్త్ ఆన్‌లైన్ డిగ్రీ ప్రవేశాలకు రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రత్యేక కేటగిరి విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలన శుక్రవారం నిర్వహించనున్నట్లు దోస్త్ కోఆర్డినేటర్ సంపత్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక కేటగిరీ పీహెచ్‌సీ (దివ్యాంగులు)/సీఏపీ/ఎన్‌సీసీ/స్పోర్ట్స్/ఎక్స్‌ట్రా కరిక్యులర్ ఆక్టివిటీస్ విద్యార్థులకు తెయూ పరిపాలనా భవనంలో ధ్రువపత్రాల పరిశీలన ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందని పేర్కొన్నారు. ఒరిజనల్ సర్టిఫికెట్స్‌తో పాటు రెండు సెట్ల జిరాక్స్ కాపీలతో కార్యాలయంలో హాజరు కావాలన్నారు. వివరాలకు 8374406322 నంబర్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

ఎస్సీ వర్గీకరణపై ఎమ్మార్పీఎస్ హర్షం



కామారెడ్డి అర్బన్ : ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తూ మాదిగ రాజకీయ పోరాట సమితి ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మిఠాయిలు పంచుకున్నారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్.బాగయ్య, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చిట్యాల సాయన్న, ప్రతినిధులు అశోక్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

మన ఊరు.. మన దుకాణం

- చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో కొత్త ఉద్యమం
- స్థానిక వ్యాపారులను ప్రోత్సహించాలని ప్రజలకు వినతి
- పట్టణంలో వెలసిన ఫ్లెక్సీలు.. సోషల్ మీడియాలోనూ విస్తృతంగా ప్రచారం

కార్పొరేట్ వ్యాపార సంస్థల రాకతో దందాలు నడవక ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానిక వ్యాపారులు ఒక్కటవుతున్నారు. 'మన ఊరు –మన దుకాణం' అంటూ చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో ఉద్యమానికి సిద్ధమయ్యారు. ఈ విషయమై సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేస్తున్న వ్యాపారులు.. పట్టణమంతా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. స్థానిక వ్యాపారులను ప్రోత్సహించాలని వారు ప్రజలను కోరుతున్నారు.

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: కామారెడ్డి పట్టణం వ్యాపార, వాణిజ్య కేంద్రంగా గుర్తింపు పొందింది. ఫార్మా, కిరాణం, బంగారం, దుస్తులు.. ఇలా ఆయా రంగాల్లో కామారెడ్డి వ్యాపారులు రాష్ట్రంలోనే గుర్తింపు పొందారు. చుట్టుపక్కల జిల్లాల వారు కూడా కామారెడ్డికి వచ్చి రిటెయిల్, హోల్‌సేల్ కొనుగోళ్లు చేస్తుంటారు. దీంతో వ్యాపారాలు జోరుగా నడుస్తుంటాయి. ఒకప్పుడు బెల్లం వ్యాపారానికి కామారెడ్డి పెట్టింది పేరు. కామారెడ్డి గంజ్‌లో అడుగుపెడితే బెల్లం వాసన వచ్చేది. అయితే బెల్లం తయారీపై ఆంక్షల ఫలితంగా బెల్లం దందా మూలకు చేరింది. దీంతో కామారెడ్డి గంజ్ ఉనికి కోల్పోయింది. అయితే ఫార్మా వ్యాపారంలో రాష్ట్రంలో కామారెడ్డి ఉన్నత స్థానంలో నిలుస్తోంది. ప్రధానంగా హోల్‌సేల్ మెడిసిన్ వ్యాపారంలో కామారెడ్డికి ప్రత్యేక స్థానముంది. ఇక్కడి ఏజెన్సీల నుంచి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు మెడిసిన్స్ సరఫరా అవుతున్నాయి. పొరుగు రాష్ట్రాలకు కూడా ఇక్కడి నుంచి మందులు పంపిస్తుంటారు. అయితే కార్పొరేట్ సంస్థలు మెడికల్ షాపులు వీధివీధినా తెరుస్తుండడంతో స్థానికంగా ఉన్న మెడికల్ వ్యాపారులకు గిరాకీలు తగ్గిపోతున్నాయి.

కామారెడ్డి పట్టణం ఒకప్పుడు దుస్తుల వ్యాపారంలోనూ ఫేమస్.. వందకుపైగా ఉన్న బట్టల దుకాణాల్లో నిత్యం రూ.లక్షల్లో వ్యాపారాలు సాగేవి. అయితే కార్పొరేట్ సంస్థలకు సంబంధించిన మాల్స్, షోరూంలు రావడంతో ఈ రంగంపైనా ప్రభావం పడింది.

నాలుగైదు జిల్లాలకు కూడలి అయిన కామారెడ్డిలో ఒకప్పుడు కిరాణా దందా కూడా బాగా జరిగింది. చుట్టుపక్కల ప్రాంతాలవారు కామారెడ్డి వచ్చి హోల్‌సేల్‌గా, రిటైల్‌గా వస్తువులను తీసుకువెళ్లేవారు. ప్రస్తుతం ఈ రంగంలోకీ పెద్ద సంస్థలు రావడంతో స్థానిక కిరాణ దుకాణాలలో వ్యాపారం దెబ్బతింది.

ఇతర ప్రాంతాలనుంచి వచ్చినవారు సానిటరీ, ఎలక్ట్రికల్, ప్లంబింగ్, ఇంజినీరింగ్, వాహన విడిభాగాలకు సంబంధించిన వ్యాపారాలు కూడా నిర్వహిస్తున్నారు. వారు పోటీని తట్టుకుని నిలబడడానికి డిస్కౌంట్లు ఇస్తుండడంతో స్థానిక వ్యాపారులకు గిరాకీ తగ్గిపోతోంది.



రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

వ్యాపారం సాగక..

కార్పొరేట్ వ్యాపార సముదాయాలు వెలుస్తుండడం, ప్రజలు వాటిని ఆదరిస్తుండడంతో స్థానిక వ్యాపారాలు కుదేలవుతున్నాయి. కొందరు కిరాణ వ్యాపారులు దందా నడవక, దుకాణాల కిరాయిలు కట్టలేక, వర్కర్లకు జీతాలివ్వలేని పరిస్థితుల్లో షాప్‌లను మూసుకునే ఆలోచనలో ఉన్నారు. మిగతా వ్యాపారాలన్నింటిలోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

జనంలోకి లోకల్ బిజినెస్ నినాదం..

స్థానిక వ్యాపారులను ప్రోత్సహించాలంటూ చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో ప్రచారం మొదలుపెట్టారు. 'మన ఊరు –మన దుకాణం' అంటూ అటు వ్యాపారులు, ఇటు ప్రజల్లో చైతన్యం తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు. చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో చేస్తున్న ప్రచారం ఆలోచింపజేస్తోంది. ఈ అంశంపై అంతటా చర్చ జరుగుతోంది. అయితే పోటీ పెరిగిన నేపథ్యంలో స్థానిక వ్యాపారులు కూడా తక్కువ లాభాలు చూసుకుని, నాణ్యమైన వస్తువులు విక్రయించడం ద్వారా వినియోగదారులను ఆకట్టుకోవాలని పలువురు సూచిస్తున్నారు.

నష్టపోతున్నారు..



వ్యాపారాలకు సంబంధించి దుకాణాల అద్దెలు, వర్కర్ల జీతాలు, నిర్వహణ ఖర్చులు అడ్డగోలుగా పెరిగాయి. దీనికి తోడు అన్ని వ్యాపారాల్లో తీవ్ర పోటీ ఏర్పడింది. కార్పొరేట్ సంస్థలు ఒకదానివెంట ఒకటి వస్తుండడంతో స్థానిక వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారు. స్థానిక వ్యాపారాలను కాపాడుకోవడానికి ప్రజలు సహకరించాలి.

– కంచర్ల లింగం, అధ్యక్షుడు, చాంబర్ ఆఫ్ కామర్స్, కామారెడ్డి

రోడ్డున పడకూడదనే...



జిల్లాలో వేలాది కుటుంబాలు చిన్న వ్యాపారాల మీదనే ఆధారపడి ఉన్నాయి. ఇప్పటికే ఆన్‌లైన్ షాపింగ్‌తో స్థానిక వ్యాపారం దెబ్బతింది. పెద్దపెద్ద మాల్స్ ఏర్పాటుతో మరింత నష్టం జరుగుతోంది. ఇలాంటి సమయంలో చిరు వ్యాపారులు రోడ్డున పడకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. ప్రజలంతా లోకల్ వ్యాపారులకు అండగా నిలవాలి.

– సుకుమార్‌గౌడ్, కార్యదర్శి, చాంబర్ ఆఫ్ కామర్స్, కామారెడ్డి

5 నుంచి 'స్వచ్ఛదనం పచ్చదనం'



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, అధికారులు

- కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ శాంతికుమారి ఆదేశం

కామారెడ్డి క్రైం: అన్ని జిల్లాలలో ఈనెల 5 నుంచి 9 వ తేదీవరకు 'స్వచ్ఛదనం పచ్చదనం' కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సూచించారు. గురువారం ఆమె కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశుధ్యం, పచ్చదనాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఐదో తేదీన అన్ని వార్డులలో కార్యక్రమాన్ని ప్రారంభించాలని సూచించారు. కార్యక్రమ నిర్వహణకు ప్రత్యేక బృందాలను నియమించాలన్నారు. ప్రతి గ్రామం లేదా మున్సిపల్ వార్డుకు ప్రత్యేక అధికారులను నియమించాలని సూచించారు.

అందరినీ భాగస్వాములను చేయాలి

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కామారెడ్డి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ కలెక్టరేట్‌లో అధికారులతో మాట్లాడారు. స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమాన్ని అన్ని గ్రామాలు, మున్సిపాలిటీల్లో విజయవంతంగా చేపట్టేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ప్రకృతి వనాలలో చనిపోయిన మొక్కలను తొలగించి కొత్తవి నాటి సంరక్షించాలన్నారు. అన్ని గ్రామాలలో పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఉల్లంఘనులపై కొరడా

- నగరంలో 18 చోట్ల పోలీసుల తనిఖీలు
- 10 రోజుల్లో 440 బైక్‌ల పట్టివేత

ఖలీల్‌వాడి : ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించే వారిపై పోలీసులు కొరడా ఝుళిపిస్తున్నారు. వాహనదారులు నిబంధనలు పాటించకపోవడంతోనే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని పోలీసులు గుర్తించారు. ప్రమాదాలను నివారించడానికి ఓ వైపు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తునే, మరోవైపు విస్తృతంగా వాహనాల తనిఖీలు చేపడుతున్నారు. సీపీ కల్మేశ్వర్ ఆదేశాల మేరకు జిల్లాలో ఆర్టీవో, పోలీసులు, ట్రాఫిక్ పోలీసులతో కంబైన్డ్ తనిఖీలను నిర్వహిస్తున్నారు. నిజామాబాద్ నగరంలో 18చోట్ల జూలై 22 నుంచి ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ట్రాఫిక్ రూల్స్‌ను అతిక్రమిస్తున్న వారి వాహనాలను స్వాధీనం చేసుకుంటున్నారు. ఈ తనిఖీల్లో జూలై31 వరకు 440 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిత్యం 40 నుంచి 50 వరకు రాంగ్‌రూట్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్ చేస్తున్న వాహనాలను పట్టుకుంటున్నారు. వాటిని స్వాధీనం చేసుకొని ఆర్టీవోకు పంపుతున్నారు. అక్కడి నుంచి క్లియరెన్స్ వస్తేనే వాహనాలు అప్పగిస్తున్నారు.



నగరంలోని ఒకటో టౌన్ ఠాణాలో ఉన్న బైక్‌లు

కంబైన్డ్ తనిఖీలు

జిల్లాలో పోలీసులు, ఆర్టీవో అధికారులు, ట్రాఫిక్ పోలీసులు జూన్ 6 నుంచి కంబైన్డ్ తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలలో జూలై 25 వరకు 903 వాహనాలను స్వాధీనం చేసుకొని జరిమానాలు విధించారు. సరైన పత్రాలు లేకపోవడంతో పలువురు తమ వాహనాలను పోలీసుల వద్దే వదిలేస్తున్నట్లు తెలిసింది. ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతున్నాయి. ఆర్టీఏ అధికారులు వారంలో రెండు రోజులు తనిఖీల్లో పాల్గొంటున్నారు. కాగా పోలీసులు వాహనాలను పట్టుకోగానే స్థానిక నాయకులు ఫోన్ చేసి వదిలేయమని ఒత్తిడి చేస్తున్నారు. తమకు సంబంధించిన వారిదని వాహనాలను విడిచిపెట్టాలని సూచిస్తున్నారు. కానీ ట్రాఫిక్ పోలీసులు మాత్రం పట్టుకున్న వాహనాలను ఆర్టీఏ అధికారులకు పంపిస్తున్నారు.

క్రీడాకారులకు సీఎం అభినందన

పిట్లం: ఇటీవల కోల్‌కతాలో జరిగిన ఆసియా చెస్ బాక్సింగ్ చాంపియన్ షిప్, ఇండియన్ ఓపెన్ ఇంటర్నేషనల్ చెస్ బాక్సింగ్ టోర్నీల్లో సత్తా చాటిన జిల్లాకు చెందిన క్రీడాకారులను సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారు. సీనియర్ మహిళా విభాగంలో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించిన పిట్లంకు చెందిన ప్రతిభ 5 గోల్డ్ మెడల్స్, ఒక సిల్వర్ మెడల్, సబ్ జూనియర్స్ విభాగంలో బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి మనవడు రుషాంక్‌రెడ్డి రెండు గోల్డ్ మెడల్స్, సీనియర్ పురుషుల విభాగంలో పిట్లంకు చెందిన విజయ్ రాఘవేంద్రరావు రెండు సిల్వర్ మెడల్స్ సాధించిన విషయం తెలిసిందే. బుధవారం రాత్రి హైదరాబాద్‌లోని పోచారం నివాసంలో వీరు సీఎంను కలిశారు. తాను పతకాలు సాధించడమే కాకుండా టీం సభ్యులకు ట్రైనింగ్ ఇచ్చి వారూ పతకాలు సాధించడానికి కారణమైన ప్రతిభను ప్రత్యేకంగా అభినందించారు.



క్రీడాకారులను అభినందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, దీపాదాస్ మున్షి

పోచారం ఇంట్లో విందుకు..

బాన్సువాడ: ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి హైదరాబాద్‌లోని తన ఇంట్లో బుధవారం రాత్రి ఇచ్చిన విందుకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రుణమాఫీ కోసం రైతుల తిప్పలు



నిజాంసాగర్‌లో వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద పడిగాపులు కాస్తున్న రైతులు

నిజాంసాగర్: పంట రుణాలు మాఫీ కాని రైతులు అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. గురువారం మండల కేంద్రంలోని వ్యవసాయశాఖ కార్యాలయానికి పలు గ్రామాల రైతులు తరలివచ్చారు. వ్యవసాయశాఖ అధికారి అమర్ ప్రసాద్ కలెక్టర్ పర్యటనకు వెళ్లడంతో గంటల తరబడి కార్యాలయం వద్దే నిరీక్షించారు. పంట రుణం తీసుకున్నా రేషన్ కార్డు, ఆధార్ కార్డుతో అనుసంధానం కాకపోవడం, బ్యాంకు ఖాతాలకు ఆధార్‌తో లింక్ లేకపోవడం తదితర కారణాలతో చాలామందికి రుణమాఫీ కాలేదు. దీంతో వారు ఆందోళన చెందుతున్నారు. సర్కారు స్పందించి అర్హులందరికీ రుణమాఫీ అయ్యేలా చూడాలని కోరుతున్నారు.

బ్యాంకుల వద్ద బారులు

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : పంటరుణం మాఫీ అయ్యిందో లేదో తెలుసుకోవడం కోసం రైతులు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులు బ్యాంకుల్లో తీసుకున్న పంటరుణాలను రూ. 1.50 లక్షల వరకు మాఫీ చేసిన విషయం తెలిసిందే. రుణమాఫీకి సంబంధించిన డబ్బులు ఖాతాలో జమ అయ్యాయో లేదో తెలుసుకోవడానికి చాలామంది బ్యాంకులకు వెళ్తున్నారు. సర్వర్, నెట్‌వర్క్ సమస్యలతో గంటల తరబడి లైన్లలో ఉండాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



తాడ్వాయిలోని యూనియన్ బ్యాంక్ వద్ద రైతుల క్యూ

'ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించండి'



ఒడ్డేపల్లి శివారులో పంటల నమోదు వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నిజాంసాగర్: ప్రజా పాలన, రైతు రుణ మాఫీకి సంబంధించిన దరఖాస్తులను స్వీకరించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. ఆయన గురువారం నిజాంసాగర్ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. రోగులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఆస్పత్రిలో ఓపీ రిజిస్టర్ పాటు ఉద్యోగుల హాజరు పట్టికలను పరిశీలించారు. ఆరోగ్య కేంద్రం జూనియర్ అసిస్టెంట్ సుభాష్ నాలుగైదు రోజులుగా విధులకు హాజరు కాకపోవడంతో సస్పెండ్ చేయాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. ఆస్పత్రి ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు.

మండలంలో సుడిగాలి పర్యటన

మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ సెల్‌ను కలెక్టర్ పరిశీలించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి అమ్మ ఆదర్శ పనులపై సంతృప్తి చేశారు. తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. భవిష్యత్‌లో ఏమవుతారని ప్రశ్నించగా.. ఓ బాలిక టీచర్‌నవుతానని పేర్కొంది. ఆమెను కలెక్టర్ అభినందించారు. అనంతరం గోర్గల్ శివారులో మొక్కలు నాటారు. వన నర్సరీలో నాటిన మొక్కలను పశువులు తింటున్నాయని, చుట్టూ కంచె ఏర్పాటుకు నిధులు ఇవ్వాలని గ్రామస్తులు కలెక్టర్‌ను కోరారు. గోర్గల్ శివారులో అటవీ భూములు కబ్జాకు గురవుతున్నాయని ఫిర్యాదు చేశారు. భూముల కబ్జాపై దరఖాస్తులు ఇస్తే విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం ఒడ్డేపల్లి శివారులో పంటల నమోదు ఆన్‌లైన్ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఆధార్ వివరాల నమోదులో గందరగోళం కారణంగా పలువురు రైతులకు రుణమాఫీ కాలేదని మండల వ్యవసాయశాఖ అధికారి అమర్ ప్రసాద్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఒడ్డేపల్లి గ్రామంలోని సహకార బ్యాంకులో 80 శాతం మందికి రుణమాఫీ కాలేదని రైతులు పేర్కొన్నారు. వ్యవసాయశాఖ అధికారులకు దరఖాస్తులు ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. రైతుల పేరుతో మాగి గాయత్రి కార్మాగారం తీసుకున్న రుణాలపై సమగ్రమైన నివేదిక ఇవ్వాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి భాగ్యలక్ష్మిని ఆదేశించారు. ఆయన వెంట జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావు, డీఎల్పీవో నాగరాజు, బాన్సువాడ ఆర్డీవో రమేశ్ రాథోడ్, తహసీల్దార్ భిక్షపతి, ఎంపీడీవో గంగాధర్, ఎంపీవో అనిత, ఆరోగ్య కేంద్రం వైద్యుడు రోహిత్‌కుమార్ తదితరులున్నారు.

తల్లిపాలు అమృతంతో సమానం

కామారెడ్డి క్రైం: తల్లిపాలను అమృతంతో సమానంగా భావించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. గురువారం కలెక్టర్ తన చాంబర్‌లో తల్లిపాల ప్రాముఖ్యతకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తల్లి పాలతో పిల్లలకు పోషకాలు అందడంతో పాటు రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. చిన్నారులకు అంటురోగాలు, అతిసారం, శ్వాస సంబంధిత వ్యాధుల నుంచి రక్షణ ఉంటుందన్నారు. తల్లిపాలు తాగే శిశువుల్లో మరణాల రేటు తక్కువని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, ఐసీడీఎస్ పీడీ బావయ్య, ప్రోగ్రాం ఆఫీసర్ అనురాధ, డీసీహెచ్ఎస్ విజయలక్ష్మి, డాక్టర్ శ్రీనివాస్, సిబ్బంది వేణుగోపాల్, చలపతి, పద్మజ, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

నాగన్నగారి బావి సందర్శన


లింగంపేట: మండల కేంద్రం సమీపంలోని నాగన్నగారి బావిని గురువారం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఇన్ఫోసిస్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ కల్పనా రమేశ్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగన్నగారి బావికి వెళ్లడానికి ఉపాధి హామీ పథకం ద్వారా ఫార్మేషన్ రోడ్డు వేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే రోడ్డుకు ఇరువైపులా అవెన్యూ ప్లాంటేషన్ ద్వారా మొక్కలు నాటాలని సూచించారు. నాలుగు హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని గ్రామ పంచాయితీ అధికారులను ఆదేశించారు. బావి చుట్టూ నిర్మిస్తున్న రక్షణ కంచెను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో నరేష్, పంచాయతీరాజ్ డిప్యూటీ ఈఈ గిరి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్, అశోక్ తదితరులు ఉన్నారు.



నాగన్నగారి బావి వద్ద వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ సంగ్వాన్

ఎస్సారెస్పీకి పోటెత్తిన వరద

బాల్కొండ: స్థానిక ఎగువ ప్రాంతాల్లో గురువారం భారీ వర్షం కురియడంతో శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద నీరు పోటెత్తింది. 41 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ఉదయం 5 వేల క్యూసెక్కులకు పడిపోయిన వరద నీరు క్రమంగా పెరిగింది. మధ్యాహ్ననికి 20 వేల క్యూసెక్కులు పెరిగిన వరద సాయంత్రానికి 41 వేల క్యూసెక్కులకు పెరిగింది. రానున్న 24 గంటల్లో మరింత వరద నీరు పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ప్రాజెక్ట్ నుంచి సరస్వతి కాలువ ద్వారా 10 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 423 క్యూసెక్కులు, మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80 టీఎంసీలు) అ డుగులు కాగా గురువారం సాయంత్రానికి ప్రాజెక్ట్ లో 1077.20 (37.24 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు పేర్కొన్నారు.



క్లుప్తంగా

వనమహోత్సవాన్ని సక్సెస్ చేయాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో సయ్యద్ సాజిద్‌అలీ అన్నారు. తాడ్వాయి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం గ్రామ కార్యదర్శులు, ఫీల్డు అసిస్టెంట్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఖాళీస్థలాల్లో మొక్కలు నాటాలన్నారు. మంచినీళ్ల ట్యాంకులను శుభ్రం చేయాలన్నారు. చెత్తను తొలగించాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో సవితారెడ్డి, ఏపీవో మల్లేశ్ పాల్గొన్నారు.

సీఎం క్షమాపణలు చెప్పాలి



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : మహిళా ఎమ్మెల్యేలు కంటతడి పెట్టేలా మాట్లాడిన సీఎం రేవంత్‌రెడ్డి క్షమాపణలు చెప్పాలని ఎల్లారెడ్డి పట్టణ బీఆర్‌ఎస్ అధ్యక్షులు ఆదిమూలం సతీష్ అన్నారు. గురువారం ఎల్లారెడ్డిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సీఎం గతంలో ఏపార్టీ నుంచి వచ్చారో గుర్తు చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సాయిలు, సొసైటీ చైర్మెన్ నర్సింలు, బీఆర్‌ఎస్ నాయకులు అరవింద్, ఇమ్రాన్, బర్కత్ తదితరులున్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి



దోమకొండ : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ నాయకులు సత్తా చాటాలని కోరుతూ గురువారం పార్టీ మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి పార్టీ జిల్లా కార్యదర్శి వడ్ల నర్సింహాచారి, అసెంబ్లీ కన్వీనర్ కుంట లక్ష్మారెడ్డి హాజరై మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల కొసం పార్టీ నాయకులు సిద్ధం కావాలని సూచించారు. పార్టీ మండల అధ్యక్షుడు మద్దూరి భూపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జగదీష్, బీజేవైఎం మండల అధ్యక్షుడు కంది మనోజ్‌కుమార్ తదితరులున్నారు.

పారిశుధ్యంపై నిర్లక్ష్యం తగదు



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : గ్రామాల్లో పారిశుధ్యం నిర్వహణపై నిర్లక్ష్యం తగదని నాగిరెడ్డిపేట ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రభాకర చారి సూచించారు. నాగిరెడ్డిపేట మండలంలోని జప్తిజాన్కంపల్లి గ్రామాన్ని గురువారం ఆయన సందర్శించారు. రామక్కపల్లి ప్రాథమిక పాఠశాలలో ఇటీవల చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించారు. హెచ్ఎం మౌనికతో మాట్లాడారు. జీపీ కార్యదర్శి శంకర్ ఉన్నారు.

బీజేపీ నూతన కార్యవర్గం ఎన్నిక



రాజంపేట : బీజేపీ గ్రామ నూతన కార్యవర్గాన్ని గురువారం బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి, మండల అధ్యక్షులు పిట్ల శీను ఆధ్వర్యంలో గ్రామ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా గుర్రాల రాము, ఉపాధ్యక్షులుగా రాజిరెడ్డి, పెద్దమ్మల సతీష్, బత్తిని రాజు, జనరల్ సెక్రటరీగా గజ్జల రాజు, కాసం ప్రసాద్, ఓబిసి మోర్చా అధ్యక్షుడు నగరపు రాజు, కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా పి నరేష్, యువజన మోర్చా అధ్యక్షుడు గా పాశం శేఖర్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా సొన్నైలా రాజశేఖర్ ఎన్నికయ్యారు.



లింగంపేట మండలం లింగంపల్లి శివారులో పంట పొలాలు



పొలం చుట్టూరా కట్టిన చీరలు

పల్లె అందాలు.. అదరహో..

ఆకాశానికి హద్దులు లేవు అన్నట్టుగా ప్రకృతి అందాలకు కూడా హద్దులు అవరోధాలు ఉండవు. కనుచూపు మేర కనిపించే పచ్చని పైర్లు.. పంటకు మేం రక్షణగా ఉంటామంటున్న చీరలు.. కురుస్తున్న వర్షాలకు పరవళ్లు తొక్కుతున్న వాగులు.. ఇలా పల్లె అందాలను వర్ణించేందుకు మాటలు చాలవేమో.. లింగంపేట, గాంధారి మండలాల పరిధిలో కనిపించిన చిత్రాలివి..

– సాక్షి ప్రతినిధి, కామారెడ్డి



లింగంపేట మండలం ముస్తాపూర్ శివారులో మంచె ఎక్కి కాపలా కాస్తున్న రైతు



నాగారం శివారులో నిండుగా ప్రవహిస్తున్న వాగు



గాంధారి మండలం గుర్జాల్ శివారులో..



గుర్జాల్‌లో పొలాల మధ్య ఆలయం

సర్టిఫికెట్ల బ్యాగు అందజేత

నాగిరెడ్డిపేట: ఆర్టీసీ బస్సులో మర్చిపోయిన ఒరిజినల్ సర్టిఫికెట్ల బ్యాగును పోలీసులు బాధితుడికి అందజేశారు. బీర్కూర్ మండలం కిష్టాపూర్‌కు చెందిన మ్యాకల మారుతి ముషీరాబాద్‌లోని తహసీల్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గురువారం ఆయన హైదరాబాద్ నుంచి బాన్సువాడ వెళ్లే బస్సులో ప్రయాణిస్తూ మెదక్‌లో టీ తాగేందుకు బ్యాగును తన సీట్లో ఉంచి కిందికి దిగాడు. టీ తాగి వచ్చేలోపు బస్సు వెళ్లిపోవడంతో ఆయన పోలీసులకు సమాచారం అందించారు. దీంతో స్థానిక పోలీసులు నాగిరెడ్డిపేట పీఎస్ ఎదుట బస్సును నిలిపి తనిఖీ చేయగా బ్యాగు లభించింది. అనంతరం బ్యాగును ఇన్‌చార్జి ఎస్సై లచ్చిరాం బాధితుడికి అందజేశారు. హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్, కానిస్టేబుల్ వినోద్, మహేశ్ ఉన్నారు.



ప్రయాణికుడికి బ్యాగు అందజేస్తున్న పోలీసులు

ఎమ్మెల్యేకు చిత్రపటం బహూకరణ



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు బొమ్మను ఓ అభిమాని తన రక్తంతో గీయించాడు. కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండల కేంద్రం గోపాల్‌పేటకు చెందిన కాంగ్రెస్ నాయకుడు గులాం తన రక్తంతో మదన్‌మోహన్‌రావు బొమ్మను గీయించి దానిని ఎమ్మెల్యేకు పుట్టినరోజు కానుకగా అందజేశాడు.

పల్లె ప్రకృతి వనం పరిశీలన

బీబీపేట : మండలంలోని యాదారం గ్రామంలో ఉన్నటువంటి బృహత్ పల్లె ప్రకృతి వనాన్ని గురువారం ఎంపీడీవో పూర్ణ చంద్రోదయ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా అందులో ఉన్నటువంటి మొక్కలను పరిశీలించారు. గ్రామంలో డ్రాగన్ ఫ్రూట్ పంటను సందర్శించారు. ఎంపీవో కృష్ణ, ఫీల్డ్ అసిస్టెంట్ నారాయణరెడ్డి ఉన్నారు.



పొంగుతున్న అలుగులు



బాన్సువాడ రూరల్ : గత వారంరోజులుగా అడపాదడపా కురుస్తున్న వర్షాలకు మండలంలోని చెరువులు జలకళను సంతరించుకున్నాయి. నెల రోజుల క్రితం నీళ్లలేక బోయిపోయిన కోనాపూర్ చెరువు ప్రస్తుతం నిండింది. దీంతో అలుగులు పొంగిపొర్లుతున్నాయి. మండలంలోని బోర్లం గ్రామ తోర చెరువు అలుగులు కూడా పొంగిపొర్లుతోంది.

జాతీయ క్రీడలకు విద్యార్థుల ఎంపిక



భిక్కనూరు : మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు జాతీయ క్రీడలకు ఎంపికయ్యారు. టగ్ ఆఫ్ వార్ క్రీడలో రాష్ట్ర స్థాయిలో జరిగిన విద్యార్థులు పాల్గొన్నారు. ఈనెల 6 నుంచి 9 వరకు ఆగ్రాలో జరగనున్న జాతీయస్థాయి క్రీడల్లో వారు పాల్గొంటున్నట్లు పాఠశాల హెచ్ఎం శ్రీనాథ్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆయన అభినందించారు.

పీఈటీలు, భాషాపండితులు తరలిరావాలి

కామారెడ్డి అర్బన్ : పీఈటీలు, పండిత ఉపాధ్యాయులకు ప్రమోషన్లు కల్పించినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెల్పడానికి ఈనెల 2న శుక్రవారం మధ్యాహ్నం 12–30 గంటలకు ఎల్బీ స్టేడియంలో నిర్వహించే భారీగా తరలిరావాలని వ్యాయామ ఉపాధ్యాయ సంఘం తెలంగాణ (పేట) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రంగ వెంకటేశ్వరగౌడ్, నోముల మధుసూదన్‌రెడ్డి ఒక ప్రకటనలో పిలుపు నిచ్చారు. శుక్రవారం ఉదయం 8గంటలకు కామారెడ్డి కర్షక్ బీఎడ్ కళాశాల నుంచి బయలు దేరుతామని వారు పేర్కొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

కామారెడ్డి క్రైం : అఖిల భారత జాతీయ ఓబీసీ 9వ మహాసభ కరపత్రాలు, గోడప్రతులను గురువారం జిల్లా కేంద్రంలోని బీసీ బాలుర హాస్టల్‌లో ఆవిష్కరించారు. బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నీల నాగరాజ్ మాట్లాడుతూ ఈనెల 7న పంజాబ్ రాష్ట్రంలోని అమృత్‌సర్‌లో మహాసభ జరుగనుందన్నారు. జిల్లా ప్రధానకార్యదర్శి ఎస్.సంతోష్, యోగేష్, అరవింద్ తదితరులున్నారు.

ముదిరాజ్‌లను బీసీ ఏలోకి మార్చాలి

భిక్కనూరు : ముదిరాజ్ కులస్తులను బీసీ డీ నుంచి బీసీ ఏలోకి మార్చాలని సోషల్ మీడియా మండల కోఆర్డినేటర్ బోన్ల సునీల్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ ముదిరాజులు రాజకీయంగా ఆర్థికంగా అన్ని విధాలుగా ఎదగాలని సూచించారు. ముదిరాజ్ కులస్తులకు రూ. 1,000 కోట్లతో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

సెక్స్ వర్క్ పేరుతో పోస్టర్లు ముద్రించిన వ్యక్తి అరెస్ట్

కామారెడ్డి క్రైం: సెక్స్ వర్క్ పేరుతో పోస్టర్లు ముద్రించి జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో అతికించిన ఓ వ్యక్తిని పట్టణపోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. వివరాలిలా ఉన్నాయి. సెక్స్‌వర్క్ పేరుతో పోస్టర్లు ముద్రించినట్లు సమాచారం రావడంతో పట్టణ పోలీసులు విచారణ చేపట్టారు. పోస్టర్‌పై ఉన్న నెంబర్‌ను సంప్రదించి విచారణ చేపట్టగా అతడిని ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌కు చెందిన భరత్‌గా గుర్తించారు. సదరు వ్యక్తి సెక్స్ రాకెట్ లాంటిది నడపడం లేదని, అతని కోసమే మహిళలు కావాలనే ఉద్దేశంతో పోస్టర్లు అతికించినట్లు విచారణలో తేలిందని ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. అసభ్యకరమైన కార్యకలాపాలకు పాల్పడినందుకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

క్రైం కార్నర్

కొబ్బరికాయలు తెంపబోయి మృత్యు ఒడిలోకి..

- ఎల్పుగొండలో విషాదం



ప్రవీణ్ (ఫైల్)

మాచారెడ్డి: ఇనుప సలాకాతో కొబ్బరికాయలు తెంపుతుండగా అది ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న 11 కేవీ విద్యుత్ తీగలపై పడడంతో విద్యుదాఘాతం సంభవించి ఓ యువకుడు మృతి చెందిన ఘటన పాల్వంచ మండలం ఎల్పుగొండలో గురువారం చోటు చేసుకుంది. మాచారెడ్డి ఎస్సై అనిల్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిని గెరిగంటి ప్రవీణ్(28) గ్రామ శివారులోని ఓ కోళ్ల ఫారం వద్ద కొబ్బరి కాయలను సలాకాతో తెంపుతుండగా ప్రమాదవశాత్తు ఆ సలాక విద్యుత్ తీగలపై పడింది. దీంతో విద్యుదాఘాతం సంభవించి ప్రవీణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. గతంలో భర్త, ఇప్పుడు కుటుంబానికి అండగా ఉండే కుమారుడి మృతి చెందడంతో తల్లి నర్సవ్వ చేసిన రోదనలు పలువురిని కంటతడి పెట్టించాయి. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై అనిల్ పేర్కొన్నారు.

బాత్‌రూమ్‌లో జారిపడి ఒకరి మృతి

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో బాత్‌రూమ్‌కు వెళ్లి జారిపడిన ఘటనలో ఒకరు మృతి చెందినట్లు నాలుగో టౌన్ ఎస్సై శ్రీకాంత్ గురువారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. డిచ్‌పల్లి మండల కేంద్రానికి చెందిన మహమ్మద్ అతురుల్లా(38) మెడికల్ ఫార్మసిస్టుగా పని చేస్తున్నారు. డెలివరీ కోసం తన భార్యను జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఉదయం బాత్‌రూంలో జారిపడి తలకు తీవ్రగాయం కావడంతో మృతి చెందారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ పేర్కొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

నిజామాబాద్‌రూరల్: మండలంలోని ఆకుల కొండూర్ గ్రామ వాగులో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు రూరల్ ఇన్‌చార్జి ఎస్సై రామారావు తెలిపారు. తీవ్ర వర్షాల నేపథ్యంలో వాగు ఉధృతి ప్రవాహానికి గుర్తు తెలియని మగవ్యక్తి మృతదేహం ఆకుల కొండూరు గ్రామ మత్తడి వద్ద కనిపించడంతో స్థానికులు రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. మృతుడి వయస్సు 50 నుంచి 55 ఏళ్ల మధ్య వరకు ఉంటాడన్నారు. ఎవరైనా మృతుడి ఆచూకీ తెలిసిన వారు 8712659849 నంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

రెండు బైక్‌లు ఢీ: ఇద్దరికి గాయాలు

బాన్సువాడ రూరల్: రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలైన ఘటన మండలంలోని కొయ్యగుట్ట సమీపంలో చోటు చేసుకుంది. పోలీసులు గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సాయికృప కాలనీలో నివాసం ఉండే సబావత్ రాజు, అనూష అనే దంపతులు జూలై30న కొత్తబాది నుంచి బాన్సువాడకు బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వచ్చిన మొగులాన్ గ్రామానికి ప్రేమ్ వీరిని ఎదురుగా బైక్‌పై వచ్చి వేగంగా ఢీకొన్నాడు. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న దంపతులకు గాయాలయ్యాయి. సబావత్ రాజు తమ్ముడు జయరాం ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యువకుడి అదృశ్యం

ఎల్లారెడ్డి: మండలంలోని లక్ష్మాపూర్‌కు చెందిన పోశెట్టి అనే యువకుడు అదృశ్యమైనట్లు ఎస్సై మహేశ్ గురువారం పేర్కొన్నారు. పోశెట్టి మామ సిద్ధయ్య పొలం పనులు సరిగా చేయడం లేదని మందలించడంతో గత నెల 29న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు పలు చోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. సిద్ధయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

నిజామాబాద్‌రూరల్: మండలంలోని ముత్తకుంటలో పేకాట స్థావరంపై దాడి చేసి పేకాట ఆడుతున్న నలుగురిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఇన్‌చార్జి ఎస్సై రామారావు గురువారం తెలిపారు. గ్రామంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో టాస్క్‌ఫోర్స్ సీఐ పురుషోత్తం తన టీమ్‌తో కలిసి పేకాట స్థావరంపై దాడి నిర్వహించారు. దాడిలో నలుగురిని అరెస్టు చేయగా వారి నుంచి రూ.55 వేల నగదు పట్టుబడినట్లు తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS OFFER

■ మీరు బైబ్యాక్ అగ్రిమెంట్‌తో లాభదాయకమైన లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబీ డైపర్ మెషిన్, ప్లాస్టిక్ ఉద్యోగ్ వ్యాపారాన్ని ప్రారంభించండి.(ప్రభుత్వ ఆమోదితము) 8376001873, 9643010487, 8376089771, 011-25920179. [DA-5872]

CHANGE OF NAME

■ I, TADAPAKALA GANGA LAXMI W/o. TADAPAKALA CHINNA BHOOMANNA R/o. H.No. 3-8 Keshpally (V), Jakranpally (M), Nzb (D). Have Changed my Name as TADAPAKALA SATYA GANGU W/o. TADAPAKALA CHINNA BHOOMANNA [Z-1080954]

WANTED

■ ఒమేగాహోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు ఇంటిపని/వంట పని కు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 20K. ఫోన్: 8977639662 / 8977639663. [H-796262]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 200/-రూ॥లు ప్రతి అదనపు లైను 50/-రూ॥లు మాత్రమే

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
నిజామాబాద్
CONTACT: 9492010949

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించి పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వద్దు

భిక్కనూరు : పారిశుధ్య పనుల్లో పంచాయతీ సిబ్బంది ఎలాంటి నిర్లక్ష్యం చేయవద్దని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు. గురువారం మండలంలోని కాచాపూర్ గ్రామాన్ని ఆయన సందర్శించి పారిశుధ్య పనులను పరిశీలించారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని సందర్శించి పలు రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ విషయంలో పంచాయతీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. నల్లాల ద్వారా వచ్చే తాగునీరు కలుషితం కాకుండా చూడ్సాలిన బాధ్యత ప్రతిఒక్కరిదన్నారు. పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఆయన వెంట డీవిజనల్ పంచాయతీ అధికారి శ్రీనివాస్, ఇన్‌చార్జి ఎంపీడీవో రాజ్ కిరణ్ రెడ్డి, గ్రామ సచివాలయ కార్యదర్శి మౌనిక, కారోబార్ తిరుమలరావు సిబ్బంది ఉన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

దోమకొండ : ప్రభుత్వ పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రవీన్ కుమార్ కోరారు. గురువారం మండలంలోని చింతమాన్‌పల్లి ముత్యంపేట గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలను ఆయన తనిఖీ చేసి సూచనలు చేశారు. విద్యార్థులకు మోనూ ప్రకారం భోజనం అందజేయాలన్నారు. అనంతరం నర్సరీని పరిశీలించారు. జర్మినేషన్ ప్లాంటేషన్ చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి పౌష్టికాహారం అందించాలన్నారు. పాలు, గుడ్ల స్టాక్‌ను పరిశీలించారు. పంచాయితీ కార్యదర్శులు రమేష్, అంజయ్య, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పరశురాంగౌడ్, లింగం, తదితరులు ఉన్నారు.



దోమకొండలోని చింతమాన్‌పల్లి పాఠశాలలో మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్

అనుమతులు లేకున్నా.. యథేచ్ఛగా..

- 'కాళేశ్వరం' టన్నెల్ కంకర తరలింపు
- పట్టించుకోని మైనింగ్ అధికారులు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని మంచిప్ప గ్రామశివారులో కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగంగా టన్నెల్ నుంచి తీసిన కంకరను క్రషర్ యజమాని అనుమతులు లేకున్నా, యథేచ్ఛగా తరలిస్తున్నారు. అధికారులు, స్థానిక నాయకులతో క్రషర్ యజమాని కుమ్మక్కై సొమ్ముచేసుకుంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. గతంలోనూ సదరు క్రషర్ యజమాని కంకరను తరలించుకెళ్లారనే ఆరోపణలు ఉన్నాయి.

ప్రభుత్వ ఆదాయానికి గండి..

కాళేశ్వరం ప్రాజెక్ట్ 21వ ప్యాకేజీలో భాగంగా మంచిప్ప నుంచి బాడ్సి వెళ్లే దారిలో టన్నెల్‌ను ఏర్పాటు చేశారు. ప్రాజెక్ట్ పనులు పూర్తి కాకపోవడంతో భవిష్యత్ అవసరాల నిమిత్తం కంకర డంపును నిల్వ చేశారు. కానీ కంజర్ శివారులోగల క్రషర్ యజమాని ఎలాంటి అనుమతులు తీసుకోకుండా రాత్రి, పగలూ తేడా లేకుండా కంకరను డంపర్ల ద్వారా తరలిస్తున్నారు. ఈవిషయపై పలుమార్లు మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారని వాపోతున్నారు.



టన్నెల్ వద్ద కంకరను తరలిస్తున్న డంపర్

పోలీస్‌స్టేషన్‌కు టిప్పర్ తరలింపు..

టన్నెల్ వద్ద నుంచి కంకర తరలిస్తున్నారనే సమాచారం అందుకున్న నీటిపారుదలశాఖ అధికారులు గురువారం పోలీసులు, మైనింగ్ అధికారులకు సమాచారమిచ్చారు. వెంటనే వారు కంకర తరలిస్తున్న టిప్పర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. జేసీబీ ట్రాలీ లేకపోవడంతో అక్కడే వదిలేసినట్లు తెలిసింది. కాగా మంచిప్ప గ్రామస్తులు అక్కడికి చేరుకుని రాత్రివేళల్లో టిప్పర్లు అతివేగంగా వెళ్తున్నాయని, వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోయారు.

కస్తూర్బా విద్యార్థులకు అవగాహన



రామారెడ్డి : రామారెడ్డి కస్తూర్బా గాంధీ విద్యార్థులకు యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ ఆధ్వర్యంలో గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులకు బాల్య వివాహాలు, సైబర్ నేరాలు, డ్రగ్స్, మత్తు పదార్థాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమానికి కళాబృందం సభ్యులు ప్రభాకర్, సాయిలు, శేషారావు, షీటీం సిబ్బంది సౌజన్య, భూమయ్య, రామారెడ్డి ఏఎస్సై రవీందర్, పాఠశాల ఎస్‌వో వనిత పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిలో రక్తదాన శిబిరం



ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గురువారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు జన్మదినాన్ని పురస్కరించుకుని క్యాంప్ కార్యాలయంలో తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం సికిల్ సెల్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 100 మంది రక్తదానం చేశారు. మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు సాయిబాబా, వినోద్‌గౌడ్, సొసైటీ వైస్ చైర్మెన్ ప్రశాంత్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు గఫార్ తదితరులున్నారు.

మొక్కలను కాపాడాలి



లింగంపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని పొల్కంపేట గ్రామ శివారులో పెద్దమ్మ ఆలయం వద్ద ఉపాధి హామీ పథకంలో నిర్వహిస్తున్న వనమహోత్సవంలో గురువారం జ్ఞాన వికాస భారతి సేవా సంస్థ సభ్యులు, క్రీడా సాహితి సాంస్కృతిక సేవా సంస్థ సభ్యులు మొక్కలు నాటారు. కార్యదర్శి మహమ్మద్ అశ్వఖ్, సంస్థ ప్రతినిధులు రామానుజాచారి, సత్యనారాయణ తదితరులున్నారు.

పెద్ద పోచమ్మకు బోనాలు



నస్రుల్లాబాద్(బాన్సువాడ) : గ్రామంలో గురువారం ఒడ్డెర సంఘం తరుపున గ్రామ దేవతలకు బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామ దేవతలైన పెద్ద పోచమ్మ, నల్లపోచమ్మలకు బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. గ్రామ కమిటీ చైర్మన్ కంది మల్లేశ్, ఒడ్డెర సంఘం సభ్యులు సాయిలు, శివ, నారాయణ తదితరులున్నారు.

బాధ్యతలు చేపట్టిన దేవాదాయ సహాయ కమిషనర్

నిజామాబాద్‌అర్బన్: ఉమ్మడి నిజామాబాద్ జిల్లా దేవాదాయ, ధర్మాదాయ శాఖ నూతన సహాయ కమిషనర్‌గా విజయరామారావు గురువారం బాధ్యతలు చేపట్టారు. బాసర జ్ఞానసరస్వతి ఆలయ గ్రేడ్–1 ఈవోగా పని చేసిన ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. గత అధికారి సుప్రియ బాధ్యతలు అప్పగించారు. కార్యక్రమంలో పలువురు ఆలయ పూజారులు పాల్గొన్నారు.



సహజీవనం చేస్తున్న మహిళను హత్య చేసి..

- ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు యత్నం
- నిందితుడిపై కేసు నమోదు

కామారెడ్డి క్రైం: సహజీవనం చేస్తున్న మహిళను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు యత్నించిన ఒకరిపై హత్య కేసు నమోదైంది. నిర్మల్ జిల్లా బాసర మండలం ఓని గ్రామానికి చెందిన ఉమ(33)కు భర్త అశోక్, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. భర్తతో గొడవల కారణంగా వీరు వేరుగా ఉంటున్నారు. పిల్లలను తల్లిగారింటి వద్ద ఉంచిన ఉమ మూడేళ్లుగా కామారెడ్డిలో తెలిసిన వారి వద్ద పనిచేస్తూ జీవిస్తోంది. అబ్బువార్ మాధవ్ అనే వ్యక్తితో సహజీవనం చేస్తూ పట్టణంలోని పీఎంహెచ్ కాలనీలో నివాసం ఉంటోంది. గురువారం వీరి మధ్య గొడవ జరగడంతో మాధవ్ చున్నీతో ఉమ మెడకు బిగించి హత్య చేశాడు. ఆపై ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించి ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు యత్నించాడని పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. మృతురాలి తల్లి గౌతిక బాయి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి మాధవ్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.